Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 214 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | శనివారం 15 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2




## వికసిత్ భారత్ కోసం దేశప్రజలంతా పనిచేయాలి

- సిందూర్ బలమైన సందేశం పంపింది
- సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో రైతులకు మేలు
- జ్యోతిబా పూలే, సావిత్రిబాయి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేశారన్న రాష్ట్రపతి
- మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ద్రౌపదీ ముర్ము



## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై రాష్ట్రపతికి ప్రధాని మోదీ ప్రశంసలు
- రాష్ట్రపతి ప్రసంగం దేశ సుస్థిరతను ప్రతిబింబిస్తోందన్న ప్రధాని
- గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రస్తావించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మహిళలు, యువత, పేదల సంక్షేమ పథకాలపై ప్రత్యేక ప్రస్తావన
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు సమిష్టి కృషికి పిలుపు





## భారత్ సహనాన్ని బలహీనత అనుకోవద్దు

- డిస్కవరీ డాక్యుసిరీస్ 'డీక్లాసిఫైడ్
- ఆపరేషన్ సింధూర్'లో మాట్లాడిన ఎన్ఎస్ఏ
- ఆపరేషన్‌లో శత్రు శిబిరాలు, ఉగ్ర పుట్టలు ధ్వంసం చేసినట్లు ధోబాల్ వెల్లడి
- పహల్గాం దాడిపై తొలిసారి మాట్లాడిన అజిత్ డోభాల్
- దాడి వెనుక సూత్రధారి ఎవరని ప్రధాని మోదీ అడిగారని వెల్లడి
- ఆపరేషన్ సిందూర్ పేరిట 9 ఉగ్రశిబిరాలపై భారత్ దాడి
- నిందితులను వేగంగా గుర్తించిన నిఘా వర్గాలపై ప్రశంసలు

# తాగునీటి కొరత రానీయొద్దు

- నెలవారీ లక్ష్యాలతో ప్రాధాన్యతా ప్రాజెక్టులు పూర్తి
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార-- జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు జల వనరుల శాఖ సీఎంకు తెలియచేసింది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శరవేగంగా చేపట్టామని వివరించారు. ఇటీవల - మిగతా3లో

## కొలంబియాకు అండగా భారత్

- బంగ్లాదేశ్ డీజిల్ అభ్యర్థన, సింధూ జలాల ఒప్పందంపైనా కీలక ప్రకటన
- భూకంప బాధిత కొలంబియాకు 20 మెట్రిక్ టన్నుల వైద్య, సహాయక సామగ్రి పంపిన భారత్
- బంగ్లాదేశ్ డీజిల్ అభ్యర్థనపైనా స్పందించిన భారత విదేశాంగ శాఖ
- బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పలు దేశాలకు ఆహ్వానాలు



## 17న భోగాపురం నుంచి రాకపోకలు ప్రారంభం

- తొలిరోజు 31 విమాన సర్వీసులు
- ఈ నెల 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు
- అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచే
- తొలుత తమ సర్వీసులు ప్రారంభించనున్న ఇండిగో సంస్థ



## త్వరలోనే కరవు ప్రాంత ప్రజల కల సాకారం



- చివరిదశకు వెలిగొండ పనులు: మంత్రి నిమ్మల
- అర్ధరాత్రి వెలిగొండ టన్నెల్స్‌లోకి మంత్రి నిమ్మల
- టీబీఎం మెషిన్ వెలికితీత పనుల పరిశీలన
- లైనింగ్ పనులను అధికారులు, ఏజెన్సీ ప్రతినిధుల నుంచి తెలుసుకున్న నిమ్మల

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

దశాబ్దాలుగా సాగు, తాగు నీటి కోసం అల్లాడిన ఉమ్మడి ప్రకాశం జిల్లా కరవు ప్రాంత ప్రజల కల త్వరలోనే సాకారం కానుంది. ఆ ప్రాంతానికి సాగు, తాగు నీరిచ్చేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం చివరి దశకు చేరింది. ఈ నెల చివరి వారంలో ట్రయల్ రన్ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అప్పటిలోగా మొదటి దశ పూర్తి చేసి నీళ్లు విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను విడుదల చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల - మిగతా3లో




## 'రెడ్ లైన్' దాటితే వరల్డ్ మ్యాప్‌లోనే ఉండరు

- పాకిస్థాన్‌కు భారత నేతల తీవ్ర హెచ్చరిక
- సింధు జలాల ఒప్పందంపై హెచ్చరించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్
- ఇది తమ దేశానికి 'రెడ్ లైన్' అని వ్యాఖ్య
- తీవ్రంగా స్పందించిన భారత రాజకీయ పక్షాలు
- దుస్సాహసాలకు పాల్పడితే భూమండలంపైనే లేకుండా పోతారని ఘాటు హెచ్చరిక
- ఉగ్రవాదం ఆపేవరకు ఒప్పందం పునరుద్ధరణ అసాధ్యమని భారత్ స్పష్టం

# పరిధి దాటొద్దు

- మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి'
- జనసైనికులకు పవన్ సూచన
- టీవీలు, సోషల్ మీడియాలో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని సూచన
- వ్యక్తిగత దూషణలకు, బూతులకు వెళ్లొద్దని నేతలు, జనసైనికులకు ఆదేశం
- రియాజ్ వ్యవహారం నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం సీరియస్



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా వేదికలపై మాట్లాడేటప్పుడు జనసేన నాయకులు, కార్యకర్తలు తమ భాష విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఎవరైనా సరే భాష, భావ వ్యక్తీకరణ విషయంలో తమ పరిధి దాటవద్దని ఆయన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ శ్రేణులు పాటించాల్సిన మార్గదర్శకాలపై జనసేన కేంద్ర కార్యాలయం ఒక కీలక ప్రకటన విడుదల చేసింది. జనసేనకు మద్దతుగా ఉండే ఒక ప్రవాసాంధ్రుడు ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు రియాజ్‌పై ఆయన పలు ఆరోపణలు గుప్పించారు. దీనిపై రియాజ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఆరోపణలు చేసిన వ్యక్తిని ఉద్దేశించి సోషల్ మీడియాలో బూతు పదజాలం వాడారు. రియాజ్ తీరుపై జనసైనికుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఈ తరహా వివాదాలకు వెంటనే చెక్ పెట్టేందుకు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం ఏమాత్రం సరికాదని పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. టీవీ చర్చలు, సోషల్ మీడియాలో మాట్లాడేటప్పుడు పార్టీ నిర్దేశించిన - మిగతా3లో

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



## దేశభక్తి, అభివృద్ధి, చేనేత వైభవానికి ప్రతీకగా కలంకారి శాలువా

### శ్రీకాళహస్తి కళాకారుల సృజనాత్మకతకు ప్రతిబింబం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
భారతదేశ జాతీయ భావం, అభివృద్ధి, సంస్కృతి, చేనేత వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకాళహస్తికి చెందిన కళాకారులు ప్రత్యేకమైన కలంకారి శాలువాను రూపొందించారు. గొల్ల మునిబాబు, కందగడ్డల నాగరాజు సంయుక్తంగా ఈ శాలువాను తీర్చిదిద్దారు. కందగడ్డల నాగరాజు రూపొందించిన చిత్ర రూపకల్పనకు గొల్ల మునిబాబు తన కలంకారి చిత్రకళా నైపుణ్యాన్ని జోడించి శాలువాకు అద్భుతమైన రూపాన్ని అందించారు. జాతీయ జెండా, అశోక చక్రం, భారతీయ చిహ్నాలతో పాటు దేశ అభివృద్ధికి ప్రతీకలైన రవాణా, వ్యవసాయం, పారిశ్రామిక ప్రగతి, శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలను ఇందులో కళాత్మకంగా చిత్రించారు. భారతీయ చేనేత వైభవాన్ని ప్రతిబింబించేలా మగ్గం, నేత కార్మికుడి చిత్రణకు కూడా ప్రత్యేక స్థానం కల్పించారు. సంప్రదాయ కలంకారి కళకు ఆధునిక భారతదేశ అభివృద్ధి, ప్రగతి భావాలను జోడిస్తూ శాలువాను రూపొందించినట్లు కళాకారులు తెలిపారు. కళ, సంస్కృతి, దేశభక్తి, అభివృద్ధి అనే నాలుగు అంశాలను ఒకే వేదికపై ప్రతిబింబించేలా ఈ కలంకారి శాలువాను రూపొందించడం జరిగిందని గొల్ల మునిబాబు తెలిపారు. శ్రీకాళహస్తి కలంకారి కళకు ఉన్న ప్రత్యేకతను చాటడంతో పాటు భారతదేశ ప్రగతి, చేనేత వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నంగా దీనిని పేర్కొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యాన్ని ఉపేక్షించేది లేదు

### టీడీపీ కార్యకర్త అయినా చర్యలు తప్పవు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
శ్రీకాళహస్తి పట్టణంలో వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్‌పై ఇద్దరు యువకులు మద్యం మత్తులో దౌర్జన్యానికి పాల్పడిన ఘటనపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారిపై దాడి చేయడం, దౌర్జన్యానికి పాల్పడటం క్షమించరాని చర్య అని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎమ్మెల్యే తెలిపారు. ఘటనకు పాల్పడిన యువకుల్లో ఒకరిని గతంలో మాజీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అనుచరుడిగా గుర్తించినప్పటికీ, అనంతరం అతడిని తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా చిత్రీకరించేందుకు వైకాపా నాయకులు ప్రయత్ని స్తున్నారని ఆరోపించారు. అయితే వ్యక్తి ఏ పార్టీకి చెందిన వాడైనా, రాజకీయ సంబంధాలతో సంబంధం లేకుండా చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలకు లేదా పోలీసులకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడటం తన బాధ్యతగా పేర్కొన్నారు. తన పార్టీకి చెందిన వ్యక్తి అయినా తప్పు చేస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. శ్రీకాళహస్తిలో వైకాపా నాయకులు రాజకీయ ఉనికిని కోల్పోతున్నారనే ఉద్దేశంతో అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆయన అన్నారు. నియోజక వర్గంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు.

## శాంతిపురం మండలంలో జోరుగా 'ఇంటింటికి తెలుగుదేశం'



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలో శుక్రవారం 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం జోరుగా సాగింది. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్. ఉదయ్‌కుమార్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ భాష్యం విశ్వనాథ్ నాయుడు పలు పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిందన్నారు. పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, నాయకులు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### శ్రీకాళహస్తిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా

## జాతీయ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**



శ్రీకాళహస్తి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తిలోని తన నివాసంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఆయన స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తిని పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి హృదయంలో మై నేషన్--నేషన్ ఫస్ట్ అనే భావన బలంగా నాటుకోవాలని ఆకాంక్షించారు. 2047 నాటికి వికసిత్ భారత్--స్వర్ణాంధ్ర సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేసేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను సగర్వంగా ఎగురవేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగి ప్రాంతం, రాష్ట్రం, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలని కోరారు.

# మెగా డీఎస్సీలో ఎంపికైన 36 మంది ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం

## వైకాపా దుష్ప్రచారాన్ని ఖండించిన ఎంపికైన అభ్యర్థులు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 14:**
శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మెగా డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన 36 మంది అభ్యర్థులతో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తన నివాసంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి దివ్య ప్రసాదాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన వెంటనే స్పందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఎంపికైన అభ్యర్థులు ఎమ్మెల్యేతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా వైకాపా నాయకులు నిర్వహిస్తున్న నిరసనలు, ప్రచారంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఎంపిక కాలేకపోయిన అభ్యర్థుల నిరాశను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూసినా ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని అభ్యర్థులు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకంతో డీఎస్సీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ మేరకు మెగా డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి, రేయింబవళ్లు చదివి ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై నిరాధార ఆరోపణలు చేయడం వారి కష్టాన్ని అవమానించడ మేనని వారు అన్నారు. డబ్బులు ఇచ్చి ఉద్యోగాలు పొందారంటూ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మెగా డీఎస్సీలో ప్రతిభ ఆధారంగా ఎంపికైన తమను రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని, తమ విజయాన్ని గౌరవించాలని అభ్యర్థులు కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా మహా బైక్ ర్యాలీ

### త్రివర్ణ పతాకాలతో మువ్వన్నెల శోభను సంతరించుకున్న పురవీధులు





**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 14:**
శ్రీకాళహస్తి దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో హర్ ఘర్ తిరంగా మహా బైక్ ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమగ్రత, ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాల్సిన సమయమిదని పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, యువతతో కలిసి ఎమ్మెల్యే మహా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలోని స్థానిక ఏపీ సీడ్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ చారిత్రాత్మక నాలుగు మాడ వీధుల గుండా ఉత్సాహంగా సాగింది. వేలాది బైకులు, రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలతో శ్రీకాళహస్తి పురవీధులన్నీ మువ్వన్నెల శోభను సంతరించుకున్నాయి. ర్యాలీలో పాల్గొన్న యువత, కూటమి శ్రేణులు దేశభక్తిని చాటుతూ ఉత్సాహంగా ముందుకు సాగారు. నియోజకవర్గ ప్రజల్లో వెల్లివిరిసిన దేశభక్తి, జాతీయ స్ఫూర్తి తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటా జాతీయ పతాకం రెపరెపలాడేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## గంగ జాతరకు పటిష్ట భద్రతా చర్యలు

### వ్యాపారులు,దుకాణదారులతో సీఐ జయచంద్ర సమావేశం...



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
రేణిగుంట పట్టణంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న గంగ జాతరను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో వ్యాపారులు, దుకాణదారుల తో సమావేశం నిర్వహించారు. రేణిగుంట సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జాతర సమయంలో పాటించాల్సిన నిబంధనలను వ్యాపారులకు వివరించారు. జాతరకు వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున పోలీసుశాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ కోరారు. రహదారులను ఆక్రమించ కుండా, దుకాణాల ముందు వస్తువులను రోడ్డుపై ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి ఉంచాలని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించాలని తెలిపారు. అత్యవసర సేవల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ సూచించారు. భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించి గంగ జాతరను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు భాగస్వాములు కావాలని సీఐ జయచంద్ర కోరారు.

## రైల్వే రోడ్డు ఏర్పాట్ల పరిశీలన.



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం అభివృద్ధి పనుల్లో భాగంగా హిందూపురం నడిబొడ్డున ఉన్న రైల్వే రోడ్డు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండడంతో ఆగస్టు 15న జాతీయ పండుగ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, బాలాజీ, పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ డి.ఈ. రమేష్, మైనారిటీ ఆర్ఎంఎస్ షఫీ , డైమండ్ బాబా, అమర్‌నాథ్, చంద్ర, రఘు, రాజు, అశోక్, ఐటీడీపీ నవీన్, తదితర నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1,000 హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం

**కార్వేటినగరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు14:**



గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో అమ్మపల్లి క్రాస్ వద్ద శుక్రవారం నిర్వహించిన 1,000 హెల్మెట్ల ఉచిత పంపిణీ కార్యక్రమం విజయవంత మైందని ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే థామస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోందని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఏటా 350--370 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతు న్నారని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చు న్నారు. హెల్మెట్లను వితరణ చేసిన పారిశ్రామికవేత్తలు మాదిరాజు గణేష్ రాజు, కుమార్ రాజుల సేవలను కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మాజీ సర్పంచ్ ఆదాం సుందర్ రాజన్‌ను కూడా ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలతో అమ్మపల్లి క్రాస్ నుంచి కార్వేటినగరం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరు మండలాల నాయకులు, యువత, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

## అన్నాసంపల్లి చెరువు కట్టకు మరమ్మతులు ముమ్మరం.



**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 14 :**
ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనల మేరకు రేణిగుంట మండలం అనాసంపల్లి గ్రామ పరిధిలోని చెరువు కట్టకు టీడీపీ నాయకులు మరమ్మతులు చేపట్టారు. వర్షాల నేపథ్యంలో కట్టకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో మట్టితో కట్టను పటిష్టం చేస్తున్నారు. కట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగిస్తూ కట్ట బలహీనపడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు టీడీపీ నాయకులు మునిరెడ్డి, యువనేత కుమార్‌రెడ్డి తెలిపారు. చెరువులో నీటి మట్టం పెరిగినా కట్టకు ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనాసంపల్లి చెరువు రైతులకు, గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించాలని కోరనున్నట్లు తెలిపారు.

### రేణిగుంటలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

## విస్తృత భద్రతా తనిఖీలు



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 14 :**
ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ మరియు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగింది. రైల్వే పోలీస్ (జిఆర్పీ/ఆర్పీఎఫ్) సిబ్బందితో సమన్వయం చేసుకొని డాగ్ స్క్వాడ్‌శీ సహాయంతో రైల్వే స్టేషన్,బస్టాండ్ పరిసర ప్రాంతాలు,ప్రయాణికుల రద్దీ ప్రాంతాలు మరియు అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. రేణిగుంట సీఐ జయచంద్ర మరియు వారి సిబ్బంది,రైల్వే పోలీస్ సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు ప్రశాంతంగా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు

**విశాఖపట్టణం :** కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత జిల్లాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీకాలం పూర్తి అయిన తర్వాత కొత్త జిల్లాపరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త జిల్లా పరిషత్‌ల ఏర్పాటుపై రాష్టంలోని అన్ని జిల్లా పరిషత్ సీఈవోలతో ప్రభుత్వం సమావేశం కానుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే, రాబోయే నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత, 2022 ఏప్రిల్‌లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, పరిపాలనాపరమైన ఇబ్బందులను నివారించడానికి, అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ మండళ్లు.. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తమ కార్యకలాపాలను కొనసాగించాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారు. మరోవైపు కొత్త జిల్లాల కోసం ప్రత్యేక జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేక కార్యాలయ భవనాలను సమకూర్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తోంది. విశాఖపట్నం జిల్లా పరిషత్ మూడు జిల్లా పరిషత్‌లుగా.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజుగా విభజించనున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనం నుంచే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది. విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో సుమారు 60 శాతం మందిని 24 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు, 30 శాతం మందిని 11 మండలాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 10 శాతం మందిని కేవలం నాలుగు మండలాలు మాత్రమే ఉన్న విశాఖపట్నం జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.




మరోవైపు అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల యంత్రాంగాలు ఇప్పటికే కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాల కోసం తగిన భవనాలను, స్థలాలను గుర్తించాయి.

**లోకల్ బాడీ ఎన్నికల తర్వాత కేబినెట్**

మంత్రులు మౌనంగా ఉంటే సహించేది లేదని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ముఖ్యంగా టీడీపీ మంత్రులకు ఆయన ఈ విషయంలో ఇప్పటికే చాలా సార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చాలా మంది మంత్రులు మౌనంగా ఉండడం.. కనీసం పన్నెత్తు విమర్శ కూడా చేయకపోవడంతో సీఎం మరోసారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే టెలీ కాన్ఫరెన్సు నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మంత్రులకు వారి బాధ్యతలను గుర్తు చేసినట్టు తెలిసింది. ఫైళ్ల క్లియరెన్సు, శాఖలపై పట్టు విషయంలో రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఐదుగురు టీడీపీ మంత్రులు పట్టు పెంచుకోలేక పోయారని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇక, ప్రత్యర్థులు చేస్తున్న దాడిని ఎదుర్కొనడంలో దాదాపు సగం మంది మౌనంగానే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా.. ప్రతి విషయాన్నీ తాను చెప్పాలంటే కుదరదని.. ఇక నుంచి అయినా.. మిషన్ మోడ్‌తో పనిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు రెచ్చిపోతున్నా.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఇక, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్క చోట కూడా.. కూటమి పార్టీలు ఓటమి చవి చూడకూడదని స్పష్టం చేశారు. ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అదే సమయంలో మీడియా ముందుకు రావడం.. ప్రజలకు మంచిని వివరించడం చేయాలని చెప్పారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా.. దాని తాలూకు ఫలితం ఓట్ల రూపంలో మారకపోతే.. ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తానే స్వయంగా మంత్రుల పనితీరును పరిశీలించనున్నట్టు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లాల ఇంచార్జ్ మంత్రులు.. అసలు జిల్లాల్లో పర్యటించడం లేదని తనకు నివేదికలు అందాయన్నారు. ముఖ్యంగా అంతర్గత పోరును తగ్గించాలని చెబుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇది సరికాదన్న ఆయన 'పనితీరు మెరుగు పరుచుకోని వారు.. ఆలోచన చేసుకోవాలి" అని పరోక్షంగా హెచ్చరించారు. వచ్చే స్థానిక ఎన్నికల తర్వాత.. ఫలితాన్ని బట్టి మార్పులు ఉండే అవకాశం ఉందని ఆయన పరోక్షంగా మంత్రి వర్గ ప్రక్షాళనపై సంకేతాలు ఇచ్చేశారు.

# ఏపీలో వడివడిగా మెట్రో అడుగులు

**విజయవాడ :** దేశంలోని చాలా నగరాలల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో సేవలు కలిగిన రాష్ట్రాల జాబితాలోకి త్వరలో ఏపీ కూడా చేరబోతోంది. ఇతర రాష్ట్రాల్లో కేవలం ఒక ఒకటి, అరా నగరాల్లోనే మెట్రో సేవలు కొనసాగుతుంటే.. ఏపీలో ఏకంగా రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లకు కేంద్రం ఆమోద ముద్ర పడే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక మదింపును కేంద్రం ప్రారంభించింది. అంటే? ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని చెప్పవచ్చు. తెలుగు నేల విభజన తర్వాత విభజిత ఏపీలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ? 2015లోనే విజయవాడతో పాటుగా విశాఖలో మెట్రో సేవల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలపై నాడు ఓ మోస్తరు అడుగులు పడినా? 2019లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టులు కాస్తా అటకెక్కేశాయి. అయితే 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసిన టీడీపీ? తిరిగి అధికారం చేజిక్కించుకుంది. అంతేకాకుండా అటు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు, ఇటు ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు కొలువు దీరడంతో? సీఎం నారా చంద్రబాబునాయుడు మరోమారు మెట్రో ప్రాజుక్టుల బూజు దులిపారు. విజయవాడ, విశాఖల మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ లను రూపొందించిన కూటమి సర్కారు.. వాటిని కేంద్రం పరిశీలనకు పంపింది. ఈ ప్రతిపాదనలపై దృష్టి సారించిన కేంద్రం? ఇటీవలే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక మదింపును ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే? ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోద ముద్ర పడనుంది. ఆ వెంటనే విజయవాడ, విశాఖల్లో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ కూడా ప్రారంభం కానుంది. వెరసి అతి త్వరలోనే ఈ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మాట. రెండు నగరాల్లో మొత్తంగా 84.63 కిలో మీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు విషయానికి



వస్తే.. పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరు దారా తొలి దశ మెట్రో రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బందరు రోడ్డు, ఏలూ రోడ్డు, గన్నవరం, పెనమలూరుల్లో భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నగరంలో 38.40 కిలో మీటర్ల మేర ఏర్పాటు కానున్న మెట్రో ప్రాజెక్టుకు రూ.10,118 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరుల వరకు రెండు మార్గాల్లో మెట్రో ఏర్పాటు కానుంది. విశాఖ మెట్రో విషయానికి వస్తే? నగరంలో మూడు మార్గాల్లో 46.22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. డబుల్ డెక్కర్ మోడ్ లో ఈ వ్యవస్థ ఏర్పాటు కానుంది. మూడు మార్గాల్లో కలిపి 43 మెట్రో స్టేషన్లు ఉంటాయి. ఇందుకోసం రూ.11,498 కోట్ల నిధులు అవసరం కానున్నట్లుగా డీపీఆర్ లో పేర్కొన్నారు. ఇక ఈ మెట్రో స్టీల్ ప్లాంట్, గాజువాక, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, గురుద్వారా, మద్దిలపాలెం, హనుమంతువాకల్లో ఇంటిగ్రేటెడ్ మెట్రో స్టేషన్లు ఏర్పాటు కానుండగా? కొమ్మాది వరకూ మెట్రో ఏర్పాటు కానుంది. రెండు ప్రాజెక్టులకు కలిపి మొత్తంగా రూ.21,616 కోట్ల మేర నిధులు అవసరం కానున్నాయి. ఈ నిధుల్లో రాష్ట్రం వాటా 20 శాతం కాగా? కేంద్రం కూడా తన వంతుగా మరో 20 శాతం నిధులను అందించనుంది. ఇక మిగిలిన 60 శాతం నిధులను ఆయా ఆర్థిక సంస్థల నుంచి రుణం రూపేణా సేకరించే దిశగా డీపీఆర్ రెడీ అయ్యింది. ఏపీలో కొనసాగుతున్న పారిశ్రామిక ప్రగతి, అమరావతి అభివృద్ధిలను పరిశీలిస్తున్న పలు ప్రైవేట్ అంతర్జాతీయ సంస్థలు మెట్రో ప్రాజెక్టులో నిధులు వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాయి. వెరసి త్వరలోనే ఏపీలో రెండు ప్రాజెక్టులు ఒకేసారి పట్టాలెక్కనున్నాయని చెప్పవచ్చు.

## ఖర్గే సభా ప్రాంగణాన్ని గంగాజలంతో
## శుద్ధి చేయడం పై కాంగ్రెస్ నిరసన

**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 14:**

శ్రీకాళహస్తి ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న రామ్‌లీలా మైదానంలోని సభా ప్రాంగణాన్ని ఎన్డీఏ ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో గంగాజలంతో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సమావేశ ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం దళితుల పట్ల ప్రత్యక్షంగా చూపిన కుల వివక్ష, అంటరానితనానికి నిదర్శనమని ఆరోపించారు. దేశంలో దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు



రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆంటోనీ,కేకేసి నియోజకవర్గ అధ్యక్షులు ఫక్రుదీన్‌తో పాటు నాగరాజు, మహేష్, దిలీప్, వెంకటరత్నం, మాస్, చరణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కొరత రానీయొద్దు

-మొదటిపేజీ తరువాయి

14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు సమీపంలో గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల సెంటిమెంట్ ను కాపాడేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా విశాఖ వరకూ ఎడమ కాలువ బ్యాలెన్సు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈలోగా అనకాపల్లి వరకూ ఉన్న నీటి వనరులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పోలవరం కుడి ఎడమ కాలువల్లో 17,500 క్యూసెక్కుల నీటి ప్రవాహానికి అనుగుణంగా పనులు చేయాలని స్పష్టం చేశారు. రెండు కాలువలకూ మంచి పేర్లను సూచించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలోని ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు పర్యాటకం గానూ తీర్చిదిద్దాలన్నారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న రాష్ట్రంగా గోదావరి నీటిని అటు ఉత్తరాంధ్రకు, ఇటు కష్ణా డెల్టా ప్రాంతానికి అవసరమైనంత మేర నీరు తీసుకునే ఆస్కారం ఉందన్నారు. విశాఖ నుంచి అమరావతి వరకూ అంతర్గత జల రవాణా మార్గాలతో అనుసంధానించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల శాఖ ఆధీనంలో ఉన్న భూముల్ని సద్వినియోగం చేసుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయటంతో పాటు నిర్వాసితుల సమస్యల్ని కూడా మానవతా దక్పథంతో పరిష్కరించాలన్నారు. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోకా పూర్తి చేయాలన్నారు. దీనికోసం నెల వారీ లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఆయకట్టుకు నీరిచ్చే అంశాన్ని కూడా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ, సీఈలు హాజరయ్యారు.

## పరిధి దాటొద్దు

-మొదటిపేజీ తరువాయి

మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. ఎవరూ కూడా ఇతరుల వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లొద్దని సూచించారు. వ్యక్తిగత దూషణలకు దిగొద్దని హెచ్చరించారు. పార్టీ సిద్ధాంతాలు, నిబంధనలకు అనుగుణంగానే నాయకులు స్పందించాలని స్పష్టం చేశారు. నాయకులు, జనసైనికులు అనవసర ఆవేశాలకు లోను కావద్దని పార్టీ సూచించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ అసభ్య పదజాలాన్ని వాడవద్దని ఆదేశించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ మహిళలను గౌరవిస్తూ మాట్లాడాలని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

ఆ విషయాలు రచ్చ చేస్తే వేటే

పార్టీ అంతర్గత విషయాలను సోషల్ మీడియా వేదికగా రచ్చ చేయొద్దని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అలాగే జనసేన భావజాలాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే పార్టీ ఏమాత్రం ఉపేక్షించదని, క్రమశిక్షణా చర్యలు ఉంటాయని చెప్పారు. జనసైనికులను కావాలని రెచ్చగొట్టే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ ప్రత్యర్థులు పన్నే వలలో పడొద్దని కార్యకర్తలను అప్రమత్తం చేశారు.

కూటమి స్ఫూర్తి ముఖ్యం

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎన్డీయే కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా ప్రతి ఒక్కరి మాట, తీరు ఉండాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మరోవైపు పార్టీ కోసం నిస్వార్థంగా కష్టించి పనిచేసే ప్రతి జనసైనికుడికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. జనసైనికులు, వీర మహిళల సంక్షేమం ఎప్పుడూ అధ్యక్షుల వారి దృష్టిలో ఉంటుందని జనసేన కేంద్ర కార్యాలయం ఆ ప్రకటనలో వివరించింది.

## 17న భోగాపురం నుంచి రాకపోకలు ప్రారంభం

భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలపై విమానయాన సంస్థలు ఒక్కొక్కటిగా తమ షెడ్యూళ్లను విడుదల చేస్తున్నాయి. ఈ నెల 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానుండగా అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి వెళ్లనున్నాయి. ఇండిగో సంస్థ తొలుత తమ సర్వీసులను ప్రారంభించనుంది. ఈ నెల 17న హైదరాబాద్, దిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతికి రానూపోనూ 31 సర్వీసులు నడపనున్నట్లు ప్రకటించింది.

**బయలుదేరే సర్వీసుల వివరాలిలా ఉన్నాయి**

భోగాపురం నుంచి హైదరాబాద్: ఈ నెల 17న ఉదయం 8.55, 10.40 గంటలకు, మధ్యాహ్నం ఒంటిగంటకు, సాయంత్రం 4.25 గంటలు, రాత్రి 7.20, 8.40, 9.20 గంటలకు బయలుదేరనున్నాయి.

భోగాపురం నుంచి దిల్లీ: ఉదయం 8.20 గంటలు, రాత్రి 10.45 గంటలకు

భోగాపురం నుంచి బెంగళూరు: మధ్యాహ్నం 2.55 గంటలు, రాత్రి 9.10 గంటలకు

భోగాపురం నుంచి చెన్నై: మధ్యాహ్నం 12.15 గంటలు, సాయంత్రం 6.35 గంటలకు

భోగాపురం నుంచి కోల్‌కతా: రాత్రి 7.50 గంటలకు

భోగాపురం నుంచి ముంబయి : మధ్యాహ్నం 3.05 గంటలకు

భోగాపురం నుంచి తిరుపతి: మధ్యాహ్నం 1.50 గంటలకు విమానాలు ప్రారంభమవుతాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

**తిరుపతి – భోగాపురం ఎంపీ విమాన ప్రయాణం**

ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి ప్రారంభమవుతాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పష్టం చేశారు. అదే రోజు తాను తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరుపతి నుంచి నుంచి భోగాపురం విమానంలో వస్తానని తెలిపారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్?లకు ధన్యవాదాలు తెలిపారు.

జగన్‌పై మండిపాటు: ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వైఎస్సార్సీపీ అధినేత జగన్ తీరుపై మండిపడ్డారు. అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవించిన జగన్?కు జైలు రూల్స్? తెలియదా అని ప్రశ్నించారు. గురువారం (నిన్న) కర్నూలు పర్యటన సందర్భంగా జగన్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. పోలీసు వ్యవస్థపై జగన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు . ఎంతో అనుభవం కలిగిన, గొప్ప విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు.

## త్వరలోనే కరవు ప్రాంత ప్రజల కల సాకారం

-మొదటిపేజీ తరువాయి

రామానాయుడు స్పష్టం చేశారు. మార్కాపురం పరిధిలోని వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్‌ను ఆయన అర్ధరాత్రి వేళ స్వయంగా సందర్శించారు. దాదాపు నాలుగు గంటల పాటు టన్నెల్‌లోనే ఉండి 12వ కిలోమీటర్ వద్ద చిక్కుకున్న టీబీఎం వెలికితీత పనులను, లైనింగ్ పనుల పురోగతిని అధికారులు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మరో వారంలోగా ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. "ఈ నెలలోనే జంట సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు విడుదల చేస్తాం. చంద్రబాబు నల్లమల సాగర్‌లో కృష్ణా జలాలకు జలహారతి ఇస్తారు. 3 దశాబ్దాల చిరకాల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేర్చబోతుంది. గొడ్డలి పార్టీ నాయకుడు వెలిగొండను జాతికి అంకితమంటూ మోసం చేశారు. నిర్వాసితులకు అన్నిరకాలుగా అండగా ఉన్నది కూటమి ప్రభుత్వమే" ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలోనే నల్లమల సాగర్‌లో కృష్ణా జలాలకు స్వయంగా జలహారతి ఇస్తారని నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ప్రాంతీయ ప్రజల మూడు దశాబ్దాల చిరకాల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేర్చబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో 'గొడ్డలి పార్టీ' నాయకులు పనులు పూర్తి చేయకుండానే వెలిగొండను జాతికి అంకితం చేస్తున్నామంటూ ప్రజలను తీవ్రంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టు నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని, వారికి పూర్తి న్యాయం చేస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సొరంగంలో విరిగిపడిన కొండచరియలు మార్కాపురం జిల్లా అర్థవీడు మండల పరిధిలోని వెలిగొండ ప్రాజెక్ట్ కాకర్ల ఆనకట్ట దగ్గర తూర్పు ప్రధాన కాలువ సప్లై ఛానల్ సొరంగంలో కొండ చరియలు విరిగి పడటంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల వర్షాలకు సప్లయ్ ఛానల్ వెనుక భాగంలోని సొరంగం కొండపై భాగంలో సుమారు 20 మీటర్ల మేర పొడవునా 2 అడుగుల వెడల్పుతో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో పైన ఉన్న దారిలో కొండచరియల జారిపడి దారంతా మూసుకుపోయింది.

# గ్రామాల్లో పోలీసుల 'పల్లెనిద్ర'

## ప్రజలకు సైబర్ నేరాలు, మహిళా భద్రతపై అవగాహన



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 14:**
చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు కుప్పం డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో శుక్రవారం శాంతిపురం మండలం వెంకటాపురం గ్రామంలో 'పల్లెనిద్ర' కార్యక్రమం నిర్వహించారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ గ్రామాన్ని సందర్శించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ధైర్యస్పర్శ, పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.

# విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి



**ఎస్.ఆర్.పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించుకో వాలని గంగమ్మగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. కళావతి సూచించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించు కుని పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణ, ఐకమత్యంతో '80' ఆకృతిలో నిలబడి దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులు స్మరించుకోవాలని, దేశ ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. 'ఐకమత్యమే మన బలం' అనే సందేశాన్ని కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. 'జైహింద్', 'వందేమాతరం' నినాదాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ దర్శకుడు ఎం. లోకనాథం, ఉపాధ్యాయులు బాలాజీ, చంద్రశేఖర్, బాబు, అజయ్‌కుమార్, పద్మశ్రీ, సరోజమ్మ, జానకీదేవి, ప్రసన్నకుమారి, అరుణకుమారి పాల్గొన్నారు.

## ద్రావిడ వర్సిటీలో ముగిసిన

# ఐదు రోజుల ప్రాయోగిక వర్క్‌షాప్



**గుడిపల్లి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం ద్రావిడ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్టార్టప్స్, జనరేటివ్ ఏఐ' అంశాలపై నిర్వహించిన ఐదు రోజుల ప్రాయోగిక వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఆగస్టు 10నుంచి14వరకు ఎన్‌టీఆర్ క్లాస్‌రూ మ్ కాంప్లెక్స్, సెమినార్ హాల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సహకారంతో, RUSA 2.0, ANU ప్రాయోజ కత్వంలో, ExcelR EduTech Pvt. Ltd. ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య ఎల్.సి. మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం, సృజనాత్మక ఆలోచనలు, స్టార్టప్‌లపై అవగాహన, జనరేటివ్ ఏఐ వినియోగంపై ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించడమే వర్క్‌షాప్ లక్ష్యమన్నారు. ఐదు రోజుల పాటు స్టార్టప్ ఆలోచనల రూపకల్పన, బిజినెస్ మోడల్, మార్కెట్ అవకాశాలు, ఆవిష్కరణలు, జనరేటివ్ ఏఐ సాధనాల వినియోగంపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఉద్యోగాలను కోరుకునేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఉపకులపతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. కిరణ్ కుమార్, యూజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయవర్ధిని, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అమ్ములు, ఆచార్య అక్యూటర్ బాబు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పి4 పథకంతో రమ్య కుటుంబానికి ఆర్థిక చేయూత

## కుట్టు మిషన్,బట్టల దుకాణం ప్రారంభం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
పేద కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 పథకంలో భాగంగా కుప్పం మండలం చెక్కునత్తం హరిజనవాడకు చెందిన రమ్య, మునెప్ప దంపతులకు కుట్టు మిషన్‌తో పాటు చిన్న బట్టల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, అదానీ గ్రూప్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ దుకాణాన్ని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలన్నదే పి4 పథకం లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని రమ్య కుటుంబం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బీరప్ప, మునిరత్నం, తిమ్మప్ప, బాలు, వెంకటాచలం, వినోద్, మాదేశ్, రామప్ప, పంచాయతీ కార్యదర్శి మురళి, వెల్ఫేర్ అసిస్టెంట్ భువనేశ్వరి, బంగారు మిత్ర తదితరులు పాల్గొన్నారు.

# త్రివర్ణ పతాకంతో మార్మోగిన పెద్దబంగారునత్తం

## ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం




**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పెద్దబంగారునత్తం గ్రామంలో శుక్రవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి.సి. నాగరాజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా దేశ స్వాతంత్ర్యం, ఐక్యత, త్యాగాలకు ప్రతీక అన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి జాతీయ జెండా ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని అవగాహన కల్పించారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం', 'జైహింద్' నినాదాలతో గ్రామంలో దేశభక్తి ఉత్సాహాన్ని నింపారు. గ్రామస్థులు సైతం ఉత్సాహంగా పాల్గొని ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.భాస్కరన్, విభాగాధిపతులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి గంగాధరన్, పీఆర్వో ప్రవీణ్ కుమార్, విద్యార్థులు, గ్రామసర్పంచ్, నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసిన కడ పీడీ వికాస్ మర్మత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు, చిన్నారులకు అవసరమైన వసతులు కల్పించడమే లక్ష్యంగా కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ శుక్రవారం పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు కుతేగానిపల్లి, శాంతిపురం, గుడికొత్తూరు, బిరుదనపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. కుతేగానిపల్లిలో రహదారి సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాంతిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల్లో మొక్కలు నాటి, రోగులు, సహాయకుల కోసం సీటింగ్, టేబుళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాళ్లబూదుగూరు పీహెచ్‌సీ సుందరీకరణను ఆదర్శంగా తీసుకుని శాంతిపురం ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. గుడికొత్తూరులో నూతన పీహెచ్‌సీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన ఆయన, అనువైన స్థలాన్ని గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బిరుదనపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, సిబ్బంది సౌకర్యార్థం మరుగుదొడ్డి నిర్మించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూర్చాలని అధికారులకు వికాస్ మర్మత్ సూచించారు.

# పచ్చని మొక్కలతో కుప్పానికి కొత్త కళ

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో 10 వేల మొక్కల నాటకం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం ప్రాంతాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో 10 వేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కుప్పం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నారు. కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్. మునిరత్నం, పీకేఎం యూడీఏ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ మర్మట్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే మొక్కల సంరక్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించడంపై పాఠశాలలు, వసతి గృహాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యాసంస్థల ప్రాంగణాలను పచ్చదనంతో నింపడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంతో పాటు భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని పరిరక్షించడమే కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

## అధికారులకు ఎంపీడీవో దిశానిర్దేశం...



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు14 :**
రేణిగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవిచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సేవల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో సూచించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని రవిచంద్ర సూచించారు.ఈ కార్యక్రమం లో ఈఓ శ్రీధర్, డాక్టర్ చక్రపాణి, హెల్త్ సూపర్వైజర్ కామరాజు, వివిధ శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురంలో శుక్రవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా హిందూపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ వి.క్రాంతికుమార్, ఎంజీఎం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పూలకుంట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు 600 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించి దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు




**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు14:**
'ఇంటింటా చెట్టు.. ఊరంతా వనం' నినాదంతో హిందూపురం రూరల్ మండలం బేవనహళ్లి పంచాయతీ నక్కలపల్లి గ్రామంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. 'మై ఇండియా.. మై విజన్' కార్యక్రమంలో భాగంగా సత్తెమ్మ గుడి సమీపంలో మొక్కలు నాటి భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరాజు, నారాయణరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సోమయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు మారుతి, గోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, గోపాలప్ప, నరసింహామూర్తి, చిన్నరాజు, కుమార్, ఐటీడీపీ మంజు, తెలుగు యువత రూరల్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, బీసీ సెల్ రూరల్ మండల అధ్యక్షుడు బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నా పార్థివదేహాన్ని వైద్య విద్యకు దానం చేయాలి : మాజీ మంత్రి రఘువీరారెడ్డి

**పెనుకొండ/పరిగి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు14:**





తన మరణానంతరం పార్థివదేహాన్ని ఖననం చేయకుండా వైద్య కళాశాలకు దానం చేయాలని కుటుంబ సభ్యులకు తెలిపినట్లు మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి తెలిపారు. పరిగి మండలం సేవామందిరం ఏఎం లింగన్న క్యాంపస్‌లో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నీలకంఠాపురం శాంతజయరాం ఐ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కీ.శే. చౌడమ్మ ప్రాథమిక కంటి పరీక్ష కేంద్రం (286వ విజన్ సెంటర్)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అవయవ, దేహదానానికి ముందుకు వచ్చి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. సమాజం మనకు ఎంతో ఇచ్చిందని, దాని రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నూతన కేంద్రంలో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రానికి స్థలం కేటాయించిన ఏఎం లింగన్న సంస్థ అధ్యక్షుడు, కరస్పాండెంట్ కేటీ శ్రీధర్‌ను ఆయన అభినందించారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143